# బుల్లెబ్బాయి పెళ్లి

నేను ఉదయం వరండాలో కూర్చొని పేపరు చూస్తుండగా, "ఏమండీ! ఈరోజు బుల్లెబ్బాయి పెళ్లిచూపులకు వెళ్లాలన్నారుగా. లేచి తయారవండి" అంది వాకిట్లోకి వచ్చి నిలబడ్డ నా భార్య.

"తొమ్మిది గంటలకు బయలుదేరాలి. ఇప్పుడు ఆరున్నరేగా. ఇంకా టైముంది" అంటూ పేపరులో తలదూర్చాను.

నాకళ్లు పేపరు చూస్తున్నా మనసు మాత్రం బుల్లెబ్బాయి పెళ్లిచూపులు గురించే ఆలోచిస్తోంది.

అదేంటోగాని అటు మేము బుల్లెబ్బాయికి పెళ్లి చేయాలని అంత పట్టుదలగా ఉంటే, విధాత మాత్రం మాకు వ్యతిరేకంగా ఈ పెళ్లి జరగడానికి వీల్లేదని దీక్ష పట్టి ఉన్నాడు.

కాకపోతే బుల్లెబ్బాయికి పెళ్లి చేయాలని ఐదేళ్లుగా ప్రయత్నిస్తూంటే కుదరకపోవడమేంటి? బుల్లెబ్బాయికి కన్నొంకరా? కాలొంకరా? ఆస్తి లేదా? చదువులేదా? అన్నీ ఎక్కువగానే ఉన్నాయి.

ఏడడుగులు పొడవు. తోమేకొద్దీ తళతళలాడే బిందెలా రోజు రోజుకూ నలుపుతో నిగారిస్తున్న నల్లని శరీరఛాయ. బారెడు వెడల్పున్న ఛాతీ, వాడి ప్రత్యేక లక్షణాలు. అంతేగాక వాడి జబ్బ చుట్టుకొలత నా ఛాతీ చుట్టుకొలతంత ఉంటుంది. వాడి ముంజేతి లావు నా నడుమంత, వాడి బరువు నా బరువుకు నాలుగురెట్లు మించి మరో వంద కేజీలు ఉంటుంది. ఉబ్బిన ముఖం, లావుగా పొడవుగా ఉన్న మీసాలు, వాడొక అమాయకుడైన రాక్షసబిడ్డలా వుంటాడు.

వాడి స్నేహితులమయిన మేము వాడి ప్రక్కన తిరుగుతుంటే గున్న ఏనుగు ప్రక్కన, కుక్క పిల్లలు తిరుగుతున్నట్లుగా ఉంటుంది.

వాడి షర్టుకి ఆరుమీటర్లు, ప్యాంటుకు మూడున్నర మీటర్లు కావాలి. వాడి ఒక్కజత బట్టలు ముగ్గురికి సరిపోతాయి. వాడి చొక్కాజేబులో ఏడాది పసిబిడ్డ సునాయాసంగా కూర్చోవచ్చు అంటుంటాడు మా మిత్రబృందంలోని శర్మ.

మా ఐదుగురు ఫ్రెండ్స్‌లో పెళ్లికాకుండా మిగిలిపోయింది వీడొక్కడే. అందరం ఇరవై ఏడు నుంచి ముప్పయి ఏళ్ళ మధ్య వయసు వాళ్ళం. మా అందరికీ పెళ్ళిళ్లయి

ఒక్కొక్కరికి ఇద్దరు లెక్కన సంతానం కలిగి, కుటుంబ నియంత్రణ కోత కూడా విధింపబడినవాళ్లం.

బుల్లెబ్బాయికి అమ్మాయిని చూడ్డం కోసం గుంటూరు కేంద్రంగా పెట్టుకొని చుట్టూ యాభై కిలోమీటర్ల పరిధిలో గాలించేశాము. ఊహు... ఎక్కడా కుదరలేదు. మొదట్లో అమ్మాయి శిల్పాశెట్టి అంత పొడవు, సిమ్రాన్ అంత అందంగా వుండాలని కోరుకున్నవాడు, చివరకు ఏదో ఒకటి ఆడపిల్లయితే చాలు అని కనిష్ఠస్థాయిలో రాజీకొచ్చినా వాడికి సంబంధం కుదరలేదు. అది వాడి దురదృష్టం.

మా ఊరు గుంటూరుకు పదిమైళ్ల దూరంలో ఉంది. మేమందరం అక్కడే హైస్కూలు వరకూ చదివి, గుంటూరు కాలేజీలో చేరాం. మా అయిదుగురిదీ మొదటినుంచీ విడదీయరాని బంధం, విడిపోని స్నేహం.

కాలేజీకి అందరం స్కూటర్ల మీద వెళ్లేవాళ్లం. నేను మాత్రం బుల్లెబ్బాయి బుల్లెట్ మీద వచ్చేవాడిని. గోడకు ఓ మూల అతుక్కున్న బల్లిలా వాడి వెనుక బండిమీద కూచొని వాడి వీపునకు కరుచుకొని ఉండేవాడిని. చూచేవాళ్ళకు ముందున్నవాడు తప్ప వెనుకనున్న నేను కనిపించేవాడిని కాదు. ఎలుక వాహనం మీద విహరించే బొజ్జ గణపయ్యలా ఉండేవాడు. వాడి వాహనం చిట్టెలుకలా ఉండేది.

కాజలేజీ చేరిన కొత్తలో వాడ్నంతా లెక్చరర్ అనుకునేవాళ్లు. మమ్మల్ని లెక్చరరు చుట్టూ సందేహాలు తీర్చుకొంటూ తిరిగే స్టూడెంట్లు అనుకునే వాళ్లు. చాలా మంది స్టూడెంట్సుతోబాటు లెక్చరర్లు కూడా వాడిని గౌరవపూర్వకంగా విష్ చేసే వాళ్లు.

బుల్లెబ్బాయిని క్లాసులో చూసి వాడొక స్టూడెంటని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. అయినా వాడితో ఎప్పటికయినా పని పడుతుందనో లేక ప్రమాదమొస్తుందనో భావించి కాబోలు కాలేజీ స్టడీస్ అయ్యేంతవరకూ స్టూడెంట్స్‌తో బాటు లెక్చరర్లు కూడా నిరభ్యంతరంగా వాడికి నమస్కారాలు పెట్టేవాళ్లు. వాడితో తిరుగుతున్న మాకు ఆ గౌరవంలో భాగముండేది.

తరువాత నాగార్జునా యూనివర్సిటీలో ప్రవేశించాం. అక్కడా ఇదే పరిస్థితి. వాడిని హెడ్ ఆఫ్‌ది డిపార్టుమెంటు ప్రొఫెసర్‌గా భావించి, వాడినడుం ఎత్తున్న మమ్మల్ని వాడి స్టూడెంట్లుగా భావించేవాళ్లు. ఎక్కడికి వెళ్లినా సకల మర్యాదలు, గౌరవ పురస్కారాలు వాడితోబాటు మాకూ లభించేవి.

కాలేజీ స్టడీస్ అయిపోయి, యూనివర్శిటీ స్టడీస్ అయిపోయిన తరువాత మేమంతా చిన్నాచితకా ఉద్యోగాల్లో చేరిపోయాం. అందరం పెళ్లిళ్లు చేసుకొని గుంటూర్లో సెటిలు

అయి, ప్రక్క ఊళ్లకు ఉద్యోగరీత్యా వెళ్లి వస్తుంటాము. మా అయిదుగురిలో వీడొక్కడికే పెళ్లి కుదరలేదన్నది మా నలుగురి బాధ.

వాడ్ని మేమందరం ఏ ఐ.పి.ఎస్సో వ్రాయమని ప్రోత్సహించాం. కానీ వాడి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. పదెకరాలు కొబ్బరితోట, పన్నెండెకరాల మామిడితోట, పాతికెకరాల మాగాణి భూమి, వెరసి కోటి రూపాయల ఆస్తికి ఏకైక వారసుడు. వాడు ఉద్యోగం చేయడం వాడి తల్లిదండ్రులకు ససేమిరా ఇష్టం లేదు.

వాళ్ల ఏకైక ధ్యేయం, వాడికి పెళ్లి చేసి, కోడలు, పిల్లలతో ఇల్లు కళకళ లాడాలని, వాడు తన పెత్తనంతో పొలాలు చూసుకొంటూ ఇంట్లోనే ఉండి పోవాలని. కానీ వాళ్ల ఆశ ఈ జన్మకు తీరేట్లులేదు.

పెళ్లిళ్ల పేరయ్య ద్వారా ముందు బుల్లెబ్బాయి తల్లిదండ్రులు వెళ్లి, అమ్మాయిని చూసి అన్నీ మాట్లాడుకొని వచ్చేవాళ్లు. ఇందులో కట్నం ఇంత కావాలని డిమాండ్ ఉండేది కాదు. బుల్లెబ్బాయి ఆస్తిపాస్తులు విని ఉవ్విళ్లూరిన అమ్మాయి తరపు వాళ్లు ఆనందంతో తల ఊపి వెంటనే అబ్బాయిని పంపమనేవాళ్లు. బుల్లెబ్బాయితో మేమంతా వెళ్లే వాళ్లం. బుల్లెబ్బాయిని చూడగానే తల వ్రేలాడేసే వాళ్లు. ఇలా ఒకటా, రెండా, నలభై తొమ్మిది సంబంధాలు చూశాం. ఈ ఐదేళ్లలో మేము పెట్టిన సెలవులన్నీ పెళ్లి సంబంధాలు చూడ్డానికే. వాడి పెళ్లిచూపులు ప్రతీదీ మాకు యజ్ఞంలా ఉంటే, వినేవాళ్లకది హాస్యకదంబంలా ఉండేది.

ఒకసారి, 'మల్లదుగు' గ్రామానికి బుల్లెబ్బాయి వెంట అమ్మాయిని చూడ్డానికి వెళ్లాము. ఆ ఇంటి పెద్ద ఎంతో వినయంగా మమ్మల్ని లోపలికి ఆహ్వానించాడు. బుల్లెబ్బాయి విశాలమైన సోఫాలో కూర్చుంటే మేం నలుగురం దాని కెదురుగా ఉన్న మరో సోఫాలో కూర్చున్నాం.

ముందు ఫలహారాలు వచ్చాయి. ఆ ఇంటాయనకు బుల్లెబ్బాయి గురించి ముందే తెలిసినట్లుంది. మా అందరికీ ప్లేట్లలో ఫలహారం పెట్టి మిగిలిన మొత్తం స్వీట్లున్న పెద్ద డిష్‌ను, మొత్తం హాటున్న మరో పెద్ద డిష్‌ను బుల్లెబ్బాయి ముందు పెట్టించాడు. మావాడు ఏమాత్రం మొహమాటం లేకుండా ఆ స్వీటు హాటుల మీద దండయాత్ర చేశాడు. వాడు ఒక్కొక్క పిడికిలితో మా ప్లేట్లలో ఉన్నంత పదార్థాన్ని పట్టుకొని, రైసుమిల్లులో వేసినట్లు నోట్లో వేసుకొని నమిలి మ్రింగసాగాడు. ఆనందంగా, తృప్తిగా చూస్తున్నాడు ఆ ఇంటాయన. వీడ్ని గురించి సమస్తమూ తెలిసి ఉంది కాబట్టి ఈ పెళ్లి తప్పక అవుతుందన్న నిర్ణయానికి వచ్చాము.

తరువాత అమ్మాయి తండ్రి, బుల్లెబ్బాయి యొక్క ఆస్తిపాస్తులను, కుటుంబ గౌరవ మర్యాదలను తనే ఏకరువుపెట్టి, అటువంటి గొప్ప కుంటుబంతో వియ్యమందడం తనకు గర్వంగా ఉందన్నాడు. ఇంతలో అమ్మాయిని తీసుకు వచ్చారు. అమ్మాయి చాలా అందంగా ఉంది. వేరేవాళ్లు గాన యితే కాకి ముక్కుకు దొండపండని, తోడేలు నోట్లో పసిబిడ్డని అనేవాళ్లు. మేము ప్రాణమిత్రులం కాబట్టి అలా అనం. వాడికీ సంబంధం కుదరాలని అందరం హృదయపూర్వకంగా కోరుకున్నాం. వాడికి అమ్మాయి నచ్చిందన్నట్లు, మాకు కూడా అమ్మాయి నచ్చిందన్నట్లు ఒకరికొకరం సైగల ద్వారా చెప్పుకున్నాం. అమ్మాయిని లోపలకి తీసుకు వెళ్లారు. అమ్మాయి వెంట అమ్మాయి తండ్రి కూడా లోపలకి వెళ్లి ఏదో గుస గుసలాడుతున్నాడు. ఎలాగయితేనేం వాళ్ల వైపు వాళ్లు కూడా చాలా సంతోషంగా ఉన్నారు. వీడికి ఇహ పెళ్లి అయిపోతుందని ఆనందంలో ఉన్న మాకు ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు.

కారణం.. లోపలినుంచి వచ్చిన అమ్మాయితండ్రి, "పెద్దాయనా" అంటూ మావాడిని సంబోధించేసరికి బుల్లెబ్బాయితోబాటు అందరం ఉలిక్కిపడ్డాం.

"పెద్దాయనా, పెళ్లి పెద్దగా వచ్చావు. సంతోషం. అన్నీ మాట్లాడుకున్నాం. అందరమూ ఒకరి కొకరం నచ్చాం. బాగుంది. ఈ నలుగురు పిల్లకాయలూ బాగున్నారు. ఎంత బాగున్నా పెళ్లి చేసుకోబోయే అబ్బాయి ఎవరో తెలియాలి గదా. లోపల ఆడవాళ్లు అడుగుతున్నారు" అన్నాడు మమ్మల్ని చూసి.

అంతే... మేము ఇక ఒక్క క్షణం అక్కడ ఉండలేదు. బుల్లెబ్బాయిని లేపి, వాడికి జరిగిన అవమానానికి చింతిస్తూ ఆ ఊళ్ళోంచి బయటపడ్డాం.

మరోసారి 'గాడిదల తిప్ప' అనే ఊరికి బుల్లెబ్బాయితో ఇంకో పెళ్లి సంబంధానికి వెళ్లాం. ఈసారి బుల్లెబ్బాయిని టిప్‌టాప్‌గా డ్రెస్‌చేసి, వాడు కొట్టొచ్చినట్లు పెళ్లికొడుకులా కనిపించేట్లుగా వాడి వెంట నాసిరకం దుస్తులు ధరించి వెళ్లాం. మమ్మల్ని మర్యాదగా ఆహ్వానించి యధారీతి స్వీట్లు, హాట్లు పెట్టారు. బుల్లెబ్బాయి వాడి స్థాయిలో వాడు ఆరగిస్తే, మా స్థాయిలో మేము ఆరగించాం. తరువాత అమ్మాయిని తీసుకురమ్మని చెప్పాం. వస్తుందన్నాడు అమ్మాయి తండ్రి.

గతంలో లా అబ్బాయి ఎవరనేది కన్ఫ్యూజన్ లేకుండా బుల్లెబ్బాయిని, ఆ కుటుంబ సభ్యులయిన ఆడవాళ్లు, మగవాళ్లు వినేటట్లుగా పెద్దగా పరిచయం చేశాను. తరువాత మళ్లీ ఒకసారి అమ్మాయిని తీసుకురమ్మని చెప్పాను.

లోపలికి వెళ్లి, కొద్దిసేపటికి తిరిగి వచ్చిన అమ్మాయి తండ్రి "అమ్మాయి రాదండీ" అన్నాడు కాస్త కఠినంగా.

"ఎందువల్లనండీ" ఆశ్చర్యంగా అడిగాడు శర్మ.

"అమ్మాయికి నూట నాలుగు డిగ్రీల జ్వరం"

"ఇప్పుడు వస్తుందని చెప్పారు గదండీ. అంతలోకే జ్వరం ఎలా వస్తుందండీ. ఒక్కసారి అమ్మాయిని రమ్మనండి. మేమంతా చూస్తాం. అమ్మాయి కూడా అబ్బాయిని చూస్తుంది" అన్నాను.

"అబ్బాయిని అమ్మాయి ఆల్రెడీ కిటికీలోంచి చూసింది బాబూ. అప్పట్నుంచే జ్వరం"

అతని సమాధానానికి మాకు నోటమాట రాలేదు. వస్తున్న కోపాన్ని అదిమిపెట్టుకొని ఒకరి కొకరు సైగలు చేసుకొని అక్కడ నుంచి బయట పడ్డాం.

ఇలా చెప్పుకుంటూ పోతూంటే ఈ నలభై తొమ్మిది సంబంధాలు ఒక్కొక్కటి, ఒక్కొక్క విభిన్న తరహాలో మిమ్మల్ని నవ్విస్తాయి.

నేను ఆలోచనల్లోంచి బయటపడి స్నానం చేసి, డ్రెసెప్ అయి, టిఫిన్ చేసి హీరో హోండా మీద మేము మామూలుగా కలుసుకొనే 'అలంకార్ టీ సెంటర్'కు చేరుకున్నాను. ఆరోజు ఆదివారం కాబట్టి సెలవు పెట్టాల్సిన అవసరం కూడా లేదు. అప్పటికే అందరూ వచ్చి ఉన్నారు.

నన్ను సాదరంగా ఆహ్వానించిన బుల్లెబ్బాయి ఆరోజు కార్యక్రమం నాకు వివరించాడు. మొదట అందరం అక్కడ నుంచి వాళ్లూరికి వెళ్లాలి. భోజనాలు చేసి అక్కడనుంచి అటే సాయంత్రం మూడు గంటలకు బయలుదేరి, అక్కడకు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న 'జామకాయల పల్లె'లో అమ్మాయిని చూడ్డానికి వెళ్లడం. అందరితోబాటు ఈ ప్రోగ్రాంకు నేనూ సరేనన్నాను.

బుల్లెబ్బాయి సైగనందుకొని ట్రేతో వచ్చిన టీ కుర్రాడు మా నలుగురి ముందు నాలుగు టీలు పెట్టి, బుల్లెబ్బాయి ఒక్కడి ముందు నాలుగు టీలు పెట్టాడు. మేం నలుగురం మా టీలు త్రాగేలోగా, తన ముందున్న నాలుగు టీలు చప్పరించేశాడు బుల్లెబ్బాయి. తరువాత కొత్త సిగరెట్ ప్యాకెట్ తెప్పించి మా నలుగురికీ నాలుగు సిగరెట్లిచ్చాడు. మేమందరం సిగరెట్లు వెలిగించాం. మేం సిగరెట్ త్రాగడం పూర్తి చేసే లోగా వాడు ప్యాకెట్‌లోని మొత్తం సిగరెట్లను ఊదిపారేసాడు.

వాడికంత ఆస్తిపాస్తులుండబట్టే వాడు లగ్జరీగా తనకోసం, మాకోసం అయ్యే ఖర్చును సునాయాసంగా భరించగలుగుతున్నాడు.

మేం అక్కడ్నుంచి బయలుదేరి మరో ఇరవై నిముషాల్లో మా స్వగ్రామానికి వెళ్లి, మా తల్లిదండ్రుల ఇళ్లకు కూడా వెళ్లకుండా నేరుగా బుల్లెబ్బాయి ఇంటికే వెళ్లాము. మమ్మల్నెంతో ప్రేమగా పలుకరించారు బుల్లెబ్బాయి తల్లిదండ్రులు.

బుల్లెబ్బాయికి తలంటి స్నానం చేయించిన అతని తల్లి, వాడిచేత పట్టుబట్టలు ధరింపజేసి, వాడిని పీటల మీద కూర్చోపెట్టి, పర్వతం ప్రక్కన ఒదిగి కూర్చున్న గువ్వపిట్టల్లా, వాడికి తానొక వైపు, తన భర్తను ఒకవైపు కూర్చుండజేసి, పంతులు మంత్రాలు చదువుతుండగా వాడిచేత, 'దుష్టగ్రహ వివాహ పీడన నిర్మూలన' వ్రతం చేయించింది. ఇలాంటిదొక వ్రతముందని మేమేగాక ఎవరూ విని ఉండరు. అది ఎవరి సృష్టో పంతులుకే తెలుసుండాలంటాడు మా శర్మ.

ఆ మధ్యాహ్నం బుల్లెబ్బాయి ఇంట్లో పంచభక్ష్యపరమాన్నాలతో సుష్టుగా తిని ఓ గంట కునుకేసి, తరువాత అక్కడికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న 'జామకాయలపల్లి'కి బయలు దేరి వెళ్లాం.

పొలాల మధ్య మట్టిరోడ్డు అయినా దారి బాగానే ఉంది. ఇరవై నిముషాల ప్రయాణం అనంతరం మాకు 'జామకాయలపల్లె' కనుచూపు దూరంలో పచ్చని చెట్లతో, ఆ చెట్లమధ్య మిద్దెలతో కనిపిస్తూ ఉంది.

ఇంతలో ఆ మట్టిరోడ్డుమీద ఒకచోట కొద్ది దూరం బురదమయమై కనిపించింది. అక్కడ వెహికల్స్ దిగి జాగ్రత్తగా నడిపించుకుంటూ మెరక వైపు నెట్టుకు వెళ్లాం. అక్కడ నుంచి రోడ్డు బాగుంది. మళ్లీ వెహికల్స్ స్టార్టు చేయబోతుండగా రోడ్డుమీద మాకెదురుగా రంకెలు వేస్తూ, బుసలు కొడుతూ పరుగెత్తుకుంటూ వస్తోందొక ఆబోతు. దానితోక పైకి లేచి ఆడుతోంది. అది దౌడు తీస్తోంది. దాని వాడి కొమ్ములతో మమ్మల్ని చీల్చేస్తుందని భయంతో వణికిపోయాం. బుల్లెబ్బాయి కూడా ముందు భయంతో గిజగిజలాడి తరువాత ధైర్యంగా, "దీన్ని తరిమేస్తాను చూడండిరా" అన్నాడు.

చకచకా పాంటు, చొక్కా విప్పి బండిమీద వేసాడు. తరువాత బనీను కూడా విప్పేసి దూసుకొస్తున్న ఆబోతు కెదురుగా నిలబడ్డాడు డ్రాయరుతో.

పోతపోసిన ఉక్కు స్తంభాల్లాంటి తొడలు, కాళ్లు, పెద్ద బాన లాంటి పొట్ట, కండలు తిరిగి ఊగుతున్న ఛాతీ, ఏనుగు తొండాల్లాంటి చేతులతో నల్ల ఏనుగులా ఉన్నాడు.

వాడు ఒక్కసారిగా, "హో...హో...హో..." అంటూ పెద్దగా సింహనాదం చేశాడు.

అంతే.... అంత వేగంగా వస్తున్న ఆ ఆబోతు సడెన్‌బ్రేకు వేసినట్లు ఆగిపోయింది. ఆ వేగానికి దాని ముందు కళ్లు మట్టిలో కూరుకుపోతే, వెనుకభాగం లేచి దభీమని క్రింద పడిపోయింది. తెప్పరిల్లి లేచి నిలబడ్డ ఆబోతు, మళ్లీ బుల్లెబ్బాయి మరో సింహనాదం చేసేసరికి ఎవరో తరుముకొస్తున్నట్లు పొలాల మీదపడి ఒకటే పరుగు. ఎటో వెళ్లి పోయింది.

తిరిగి బుల్లెబ్బాయి బట్టలు ధరిస్తుండగా అప్పటివరకూ ఆబోతుకు భయపడి చకచకా తాటి చెట్లు ఎక్కిన పొలాల్లోని కూలీలు, చెట్లు దిగి వాడ్ని సమీపించారు. బుల్లెబ్బాయి పేరు, వివరాలు తెలుసుకొని అభినందనల వర్షం కురిపించారు. ఆ ఆబోతు దాడికి ఎదురు నిలిచినవాళ్లు ఎవరూ ఇప్పటికి బ్రతికి బట్టకట్టలేదని, అలాంటిదాన్ని భయపెట్టగలిగిన ఏకైక మగాడు బుల్లెబ్బాయేనని ప్రశంసించారు.

అక్కడనుంచి పెళ్లిచూపుల వారింటికి వెళ్లాం. మా వెనుకనే పరుగులుపెట్టి ఊళ్లోకి వచ్చిన కూలీలు బుల్లెబ్బాయి లీలలు గురించి కథలు కథలుగా చెప్పారు. అంతే.. బుల్లెబ్బాయి కాస్తా 'గ్లామరబ్బాయి'గా మారాడు. సినిమా హీరోను చూడ్డానికి వచ్చినట్లు, అతన్ని చూడ్డం కోసం జనం గుంపులు గుంపులుగా ఆ ఇంటిముందు నిలబడ్డారు.

పెళ్లి చూపులు ప్రశాంతంగా జరిగాయి. అమ్మాయి నిజంగానే శిల్పాశెట్టి కంటే పొడుగ్గా, సిమ్రాన్ కంటే అందంగా ఉంది. ఆ అమ్మాయి మా బుల్లెబ్బాయి వైపు హీరోవర్షిప్‌తో, ఆరాధనా పూర్వకంగా చూడడం మాకో వింత అనుభవం.

వాళ్ల కుటుంబ గౌరవాన్ని కాపాడగల ఏకైక వ్యక్తి, తమ ఆస్తి వ్యవహారాలను చూడగల సమర్థుడు, తమ ఊరిని కాపాడగల శౌర్యవంతుడు, వేయేల తమ ఇంటికి తగ్గ అల్లుడు బుల్లెబ్బాయేనని అమ్మాయి తండ్రి, ఆమె బాబాయిలు ఏకగ్రీవంగా అంగీకరించారు. అతని కాబోయే అత్తగారియితే బుల్లెబ్బాయికి ఎర్రనీళ్లతో దిష్టితీసి, ఏదో మంగళకరమైన పాట కూడా పాడింది.

మేం తిరిగివస్తుండగా ఊరి మధ్య రచ్చ అరుగు దగ్గర కుర్రవాళ్లు కుర్చీలు వేసి బుల్లెబ్బాయికి దండలు వేసి ఘనంగా సన్మానం చేశారు. అక్కడ గుమిగూడిన పిల్లా, పెద్దా, ఆడా, మగా 'బుల్లెబ్బాయికీ జై' అంటూ నినాదాలు చేశారు.

అసలు వీడికి పెళ్లే కాదనుకున్న మాకు, వీడికిలాంటి రాయల్ సంబంధం దొరకడం, పెళ్లికి ముందే ఊరి ప్రజలు వాడికి ఘన సన్మానం చేయడం మాకో మరపురాని అనుభూతి ✹

**(ఆంధ్రభూమి వీక్లీ, తేది. 6-6-02)**